

మహబూబ్‌నగర్‌లోని మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం జక్కల్‌దాని తండాలో సీఎం అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర శాసనసభా స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి



నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారాన్ని వడ్డిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

# సీఎం నాష్తా.. భవిష్యత్తుకు రాస్తా

## దేశానికే ఆదర్శంగా 'సీఎం బ్రేక్ ఫాస్ట్'

## విద్యార్థుల తల్లిదండ్రుల హర్షాతిరేకాలు

## ఆకలి మరిచి, చదువుపై మనసు నిమగ్నం

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): పిల్లలకు పుష్టికరమైన ఆహారంతో కడుపు నింపితేనే వారు చదువుపై మనస్సు నిమగ్నం చేస్తారని, ఆపై ఆటపాటల్లో రాణిస్తారని భావించిన సీఎం కేసీఆర్ బ్రేక్‌ఫాస్ట్ పథకానికి రూపకల్పన చేశారు. అమ్మలా ఆలోచించి ప్రారంభించిన ఈ పథకానికి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థి దశలో మేధో వికాసమే లక్ష్యంగా మధ్యాహ్న భోజనం, బెల్లం కలిపిన రాగిజావ, పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసుల సమయంలో ఉచితంగా స్నాక్స్ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్నది. వాటికి కొనసాగింపుగా సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. పిల్లల్లో విద్యా ప్రమాణాల పెంపు, వారి మేధో సామర్థ్యాలను పెంచేందుకు తొలిమెట్టు, లక్ష్య, ఉన్నతి వంటి కార్యక్రమాలను ప్రారంభించిన ప్రభుత్వం.. పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు, హాజరును మెరుగుపరిచేందుకు, డ్రాపౌట్స్‌ను తగ్గించడమే లక్ష్యంగా సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా 27,147 ప్రభుత్వ జిల్లా, మండల పరిషత్తు, ఎయిడెడ్, మాడల్ స్కూళ్లు, మదర్సాలలో చదువుకుంటున్న దాదాపు 23 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం కలుగుతుంది. ఈ పథకం అమలుకు ఏటా రూ.500 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయనున్నది. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉపాహారం అందించే పథకాన్ని సీఎం కేసీఆర్ ఆదేశాలమేరకు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సహా రాష్ట్రవ్యాప్తంగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యే లు, ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, అధికారులు ప్రారంభించారు. ఉత్సాహభరిత వాతావరణంలో, విద్యార్థులు, తల్లిదండ్రుల కోలాహలం మధ్య ఈ పథకం ప్రారంభమైంది.



హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ స్కూల్‌లో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు , సత్యవతి రాథోడ్

### ఇప్పటికే అనేక పథకాలు

దేశంలో మధ్యాహ్నభోజన పథకాన్ని 1 నుంచి 8 వ తరగతుల వరకే అమలుచేస్తుండగా.. రాష్ట్రంలో 9, 10 తరగతులకు కూడా విస్తరించి సీఎం కేసీఆర్ మానవీయతను చాటారు. దీనికోసం ప్రభుత్వం అదనంగా రూ.137 కోట్లు ఖర్చు చేస్తున్నది. దొడ్డు బియ్యానికి బదులు సన్నబియ్యం, వారానికి మూడు గుడ్లను అదనంగా అందజేస్తున్నది. సన్నబియ్యం కోసం రూ.187 కోట్లు, గుడ్ల కోసం రూ.120 కోట్లు అదనంగా భరిస్తున్నది. విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు మన ఊరు-మన బడి వంటి కార్యక్రమాలతో పాటు, క్రీడా సౌకర్యాలు, మౌలిక సౌకర్యాల పెంపు, పాఠశాలల అభివృద్ధి, ఉపాధ్యాయులు, లైబ్రేరియన్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు, ఇతర సిబ్బంది నియామకం వంటి ఎన్నోచర్యలను ప్రభుత్వం చేపట్టింది.



కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్ , కలెక్టర్ బీ గోపి



వనపర్తిలోని 18వ వార్డు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి



నిర్మల్ జిల్లా సోన్‌లోని ప్రాథమిక పాఠశాలలో అల్పాహారం పథకాన్ని ప్రారంభించి రుచిచూస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి



సూర్యాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి అల్పాహారం పథకాన్ని ప్రారంభించి విద్యార్థినితో కలిసి ఇడ్లీ తింటున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



వికారాబాద్ శివారెడ్డిపేట పాఠశాలలో పథకాన్ని ప్రారంభించి విద్యార్థులతో కలసి అల్పాహారం తింటున్న మంత్రి మహేందర్‌రెడ్డి



ఖమ్మంలోని రోటరీనగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరిస్తున్న మంత్రి పువ్వాడ, కలెక్టర్ వీపీ గౌతమ్



జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చెందోలి పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

# యాదాద్రిపై పర్యావరణ కుట్ర

- తుది అనుమతుల మంజూరులో తీవ్ర జాప్యం
- కేంద్ర విద్యుత్తుశాఖ లేఖ రాసినా స్పందించని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ
- ఎన్జీటీ సూచనలన్నీ పూర్తి చేసినా పట్టించుకోని వైనం
- వైటీపీఎస్ పనులు 73% పూర్తి చేసిన టీఎస్ జెన్‌కో



హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): నల్లగొండ జిల్లా దామరచర్లలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ (వైటీపీఎస్)కు అవసరమైన అనుమతుల మంజూరులో కేంద్ర అటవీ, పర్యావరణశాఖ తీవ్ర జాప్యం చేస్తున్నది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ జెన్‌కో ఆధ్వర్యంలో 4,000 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యంతో 2017 జూలైలో వైటీపీఎస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టగా ఇప్పటికే 73% పనులు పూర్తయ్యాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలోనే రూ.29,965.48 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టగా.. ఇప్పటికే రూ.21,837.02 కోట్ల పనులు పూర్తయ్యాయి. నిజానికి వైటీపీఎస్‌కు కేంద్ర పర్యావరణ, అటవీ, క్లైమేట్‌చేంజ్ శాఖ 2017 జూన్ 29న పర్యావరణ అనుమతులిచ్చింది. తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కూడా ఆ మరుసటి నెల 25న క్లియరెన్స్ ఇచ్చింది. అన్ని రకాల అనుమతులు రావడంతో టీఎస్ జెన్‌కో యుద్ధప్రాతిపదికన పనులను ప్రారంభించారు. అయితే కరోనా మహమ్మారితోపాటు చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో రెండు స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీవో) వేసిన పిటిషన్ల కారణంగా నిర్మాణంలో కొంత జాప్యం జరిగింది. కేసులు వేసిన ముంబైకి చెందిన కన్జర్వేషన్ యాక్షన్ ట్రస్ట్, విశాఖపట్టణానికి చెందిన సమత సంస్థల కేసులను వాదిస్తున్న న్యాయవాది రిత్విక్‌దత్తాకు అమెరికన్ సంస్థల నుంచి నిధులు వస్తున్నాయనే ఆరోపణలు ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో విద్యుత్తు కేంద్రానికి సంబంధించిన సివిల్ పనులు చేసుకోవచ్చని, కమిషనింగ్ మాత్రం నిలిపివేయాలని ఎన్జీటీ ఆదేశించింది. ఈ సందర్భంగా కేంద్ర పర్యావరణ, అటవీ శాఖకు ఎన్జీటీ చేసిన పలు సూచనలు చేసింది. ఆయా సూచనలను, అధ్యయనాలను టీఎస్‌జెన్కో తొమ్మిది నెలల్లోనే పూర్తిచేసి, కేంద్రానికి సమర్పించింది. ఈ అధ్యయనాలకు అనుగుణంగా అవసరమనుకుంటే రివైజ్డ్ టెర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీవోఆర్)ను నిర్దేశించిన గడువు (9 నెలలు)లోగా సిద్ధం చేసి, ప్రాజెక్టును ప్రారంభించడానికి పూర్తి అనుమతి ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర పర్యావరణ, అటవీశాఖపై ఉన్నది. ఆ గడువు 2023 జూన్ నాటికే ముగిసినప్పటికీ వైటీపీఎస్‌ను ప్రారంభించేందుకు పూర్తిస్థాయి అనుమతులను ఇవ్వడంలో కేంద్ర అటవీ, పర్యావరణశాఖ జాప్యం చేస్తున్నది.

### బాసటగా నిలవాల్సిన బాధ్యత కేంద్రానిదే

వైటీపీఎస్ ప్రారంభానికి అనుమతులు ఇవ్వాలని ఇప్పటికే అనేకసార్లు టీఎస్ జెన్‌కో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు లేఖలు రాసింది. అంతేకాకుండా 2023 మే 11న కేంద్ర విద్యుత్తు శాఖ కార్యదర్శి అలోక్‌కుమార్ సైతం సమస్యను వెంటనే పరిష్కరించి, అనుమతులు మంజూరు చేయాలని పర్యావరణ శాఖ కార్యదర్శి లీనానందన్‌కు లేఖ రాశారు. నాలుగు నెలలైనా పర్యావరణ శాఖ నుంచి స్పందన లేదు. కేంద్రంలోని ఒక మంత్రిత్వ శాఖ రాసిన లేఖను మరో మంత్రిత్వశాఖ పట్టించుకోకపోవడం విడ్డూరం. ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలో ఒకేచోట 4,000 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని నిర్మించడం బహుశా దేశంలోనే ఇదే ప్రథమం. అంతటి ప్రతిష్ఠాత్మక యాదాద్రి థర్మల్ ప్రాజెక్టుకు సంపూర్ణ సహకారం అందించాల్సిన అటవీ, పర్యావరణ శాఖ ఇప్పటికైనా మేల్కొనాలి. దేశవ్యాప్తంగా విద్యుత్తు అవసరాలు, విద్యుత్తు కోతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టు ప్రారంభానికి బాసటగా నిలవాల్సిన బాధ్యత కేంద్రంపై ఉన్నది.

### వైటీపీఎస్‌పై విదేశీ కుట్ర కోణం

- లాయర్ రిత్విక్‌దత్తాపై సీబీఐ కేసుతో బట్టబయలు
- ప్రాజెక్టు ఆలస్యానికి ఎన్జీవోలు వేసిన పిటిషన్లే కారణం


హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): దేశంలోని బొగ్గు ప్రాజెక్టులు, బొగ్గు ఆధారిత ప్రాజెక్టులపై కేసులు వేసి, ఆయా ప్రాజెక్టుల నిర్మాణాలను నిలిపివేయడమే లక్ష్యంగా విదేశీశక్తులు పన్నిన కుట్రలపై ఇటీవల సీబీఐ కేసు నమోదు చేసింది. ప్రముఖ పర్యావరణ న్యాయవాది రిత్విక్‌దత్తాపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. రిత్విక్‌దత్తా ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్ఏ)ను ఉల్లంఘించినట్టు సీబీఐ పేర్కొన్నది. వైటీపీఎస్‌కు మంజూరు చేసిన పర్యావరణ అనుమతులపై ముంబై, విశాఖపట్టణం కేంద్రాలుగా పనిచేసే రెండు ఎన్జీవో సంస్థలు దాఖలు చేసిన కేసులను వాదిస్తున్నది రిత్విక్‌దత్తాయే కావడం గమనార్హం. సీబీఐ నమోదుచేసిన ఎఫ్ఐఆర్ ప్రకారం.. రిత్విక్‌దత్తాకు చెందిన 'లైఫ్' సంస్థకు అమెరికాకు చెందిన 'ఎర్త్‌జస్టిస్' సంస్థ నుంచి విదేశీ నిధులు అందుతున్నాయి. ఈ నిధులను భారతదేశంలోని బొగ్గు, బొగ్గు ఆధారిత ప్రాజెక్టులపై కేసులు వేసి వాటి నిర్మాణాలను ఆపేందుకు ఉపయోగిస్తున్నట్టు సీబీఐ గుర్తించింది. రిత్విక్‌దత్తాకు 2013-14లో అమెరికా సంస్థ నుంచి రూ.41 లక్షల విదేశీ నిధులు అందాయని సీబీఐ గుర్తించింది. ఈ నేపథ్యంలోనే దత్తా నేతృత్వంలో ఆవిర్భవించిన లైఫ్ సంస్థకు 2016-2021 మధ్యకాలంలో మొత్తంగా రూ.22 కోట్ల విదేశీ నిధులు వచ్చాయన్నది సీబీఐ అభియోగం. ఎర్త్‌జస్టిస్ సంస్థ వివిధ దేశాల్లోని న్యాయవాదులకు ఫండింగ్ చేస్తూ.. ఆయా దేశాల్లో బొగ్గు, బొగ్గు ఆధారిత ప్రాజెక్టులపై కేసులు వేయించి, తద్వారా ప్రాజెక్టులను నిలిపివేయడమే లక్ష్యంగా విదేశీ నిధులను గుమ్మరిస్తున్నదని పేర్కొన్నది. ఈ నేపథ్యంలోనే ఈ సంస్థ నుంచి దత్తాకు కూడా నిధులు వచ్చినట్టుగా తెలిపింది. యూరోపియన్ క్లైమేట్ ఫౌండేషన్ (ఈసీఎఫ్) అనే సంస్థ కూడా 1,20,000 అమెరికా డాలర్ల నిధిని ఎర్త్‌జస్టిస్ సంస్థ ద్వారా లైఫ్‌సంస్థకు అందించేందుకు రంగం సిద్ధం చేస్తున్నదని, ఈ నిధులతో వివిధ ప్రాజెక్టులను అడ్డుకునేలా పిటిషన్లు వేయాలనే ఆలోచన ఉన్నట్టు సీబీఐ పేర్కొన్నది. యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా ఎన్జీవోల ముసుగులో పిటిషన్లు వేసినట్టు స్పష్టమవుతున్నది.

# 56% పెరిగిన భూగర్భ జలాలు

- రాష్ట్రంలో 19 శాతం మేరకు తగ్గిన వినియోగం
- ప్రభుత్వ జల సంరక్షణ చర్యలతో అద్భుత ఫలితాలు
- కేంద్ర, రాష్ట్ర భూగర్భ జల శాఖల నివేదిక వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ, కాళేశ్వరం, ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు, ఇతర జలసంరక్షణ చర్యలు అద్భుత ఫలితాలను ఇస్తున్నాయి. వీటి ఫలితంగా భూగర్భ జలాలు ఏటికేడు భారీగా పెరుగుతున్నాయి. 2013తో పోల్చితే ప్రస్తుతం భూగర్భ జల మట్టం 4 మీటర్ల మేరకు వృద్ధి చెందిందని, దీంతో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం భూగర్భ జలాలు 56 శాతం (472 టీఎంసీల నుంచి 739 టీఎంసీలకు) పెరిగాయని కేంద్ర, రాష్ట్ర భూగర్భ జల శాఖలు తమ సంయుక్త నివేదికలో వెల్లడించాయి. రాష్ట్రంలో భూగర్భ జలాల వెలికితీత గత తొమ్మిదేండ్లలో 58 శాతం నుంచి 39 శాతానికి తగ్గినట్టు ఈ నివేదిక తేల్చింది. 2023 సంవత్సరానికి సంబంధించి 'తెలంగాణ స్టేట్ డైనమిక్ గ్రౌండ్ వాటర్ రిసోర్సెస్' పేరుతో రూపొందించిన నివేదికను ఇటీవల ఇరిగేషన్ శాఖ రాష్ట్రస్థాయి కమిటీ ఆమోదించింది.

### నివేదిక వివరాలు ఇవీ..




### సంవత్సరాలవారీగా భూగర్భ జలాల లభ్యత

| సంవత్సరం | అందుబాటులో ఉన్న జలాలు (ఎంసీఎం) | వినియోగం | శాతం |
|---|---|---|---|
| 2013 | 13,390 | 7,766 | 58% |
| 2017 | 12,363 | 8,093 | 65% |
| 2020 | 15,128 | 7,675 | 50% |
| 2022 | 19,251 | 8,009 | 4% |
| 2023 | 20,920 | 8,085 | 38.65% |

(నోట్: రాష్ట్ర ఏర్పాటు తర్వాత మొత్తంగా భూగర్భ జలాల లభ్యత 56% మేరకు పెరిగింది)

భూగర్భ జలాల వినియోగం: వ్యవసాయానికి 90% | పరిశ్రమలకు 4% | గృహావసరాలకు 6%

### 2023 సంవత్సరంలో..

| క్యాటగిరీ | కమాండ్ ఏరియా | నాన్-కమాండ్ ఏరియా | మొత్తం టీఎంసీలు | 2022లో మొత్తం టీఎంసీలు |
|---|---|---|---|---|
| భూగర్భ జలాల లభ్యత | 10,036 | 10,864 | 739 | 680 |
| వినియోగం | 2,929 | 5,149 | 286 | 283 |
| భవిష్యత్ అవసరాలకు అందుబాటులో ఉన్నవి | 7,042 | 5,775 | 452 | 400 టీఎంసీలు |

(నోట్: గతేడాదితో పోల్చితే భూగర్భ జల వినియోగం 3శాతం తగ్గింది.)